

అడ్డంకులు అధిగమించి..
ఆర్థిక అంశాలు, ఇతర సమస్యలను అధిగమిస్తూ గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన వారు నియామక పత్రాలు అందుకోనున్నారు. 10లో



వైభవంగా గిరిప్రదక్షిణ
ఖమ్మంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఉత్సవ విగ్రహాలతో గిరిప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 30° / 24°
జిల్లాలో శుక్రవారం కనిష్ట ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. వలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అన్నపూర్ణాదేవిగా అలివేలు మంగమ్మ



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నాలుగో రోజైన గురువారం అర్చకులు తెల్లవారుజామునే స్వామికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మ వార్ల ఉత్సవ మూర్తుల వద్ద హోమ పూజలు చేశాక అలివేలు మంగ అమ్మ వారిని అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు వైద్యపరీక్షలు



వైద్యశిబిరంలో పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రవీణ్ ఈఎన్‌టి ఆస్పత్రి ఆధ్వర్యాన గురువారం ఏర్పాటుచేసిన శిబిరాన్ని సీపీ సునీల్‌దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేయించామని తెలిపారు. నిత్యం విధినిర్వహణలో ఉండే పోలీసు సిబ్బందికి ఏ సమస్య వచ్చినా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, రామానుజం, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు నర్సయ్య, సుశీల్‌సింగ్, సీఐ మోహన్‌బాబు, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సాంబశివరావు, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునికత అవసరం



మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

వైరా: పంటల సాగులో రైతులు ఆధునిక విధానాలు అవలంబించాలని, తద్వారా ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ సూచించారు. ఆధునిక సాగు పద్ధతులపై గురువారం వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పత్తిలో అధిక సాంద్రత విధానం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తలు ఆరోగ్యకరమైన పంటల సాగు, ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి, పంట మార్పిడి, ఎరువుల వినియోగంలో సమతుల్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మధిర వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రుక్మిణీదేవి, ఫ్యాక్ట్ సంస్థ డిప్యూటీ మేనేజర్ సురేష్‌కుమార్‌రెడ్డి, వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూముల ధరలకు అనుగుణంగా విలువ

● అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన భూముల మార్కెట్ విలువ సవరణ, నిషేధిత భూముల జాబితా రిజిస్టర్, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, రేషన్ షాపుల పర్యవేక్షణ, హైవేలకు భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో సర్వే నంబర్ వారీగా అధ్యయనం చేసి భూముల విలువ సవరణకు ప్రతిపాదించాలని తెలిపారు. హైవేలకు సేకరించిన భూముల మ్యూటేషన్ పూర్తి చేయాలని, భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు. అలాగే, రేషన్ షాపులను తహసీల్దార్లు తనిఖీ చేస్తూ డీలర్లు మాత్రమే నడిపేలా చూడాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, ఆర్డీఓ నరసింహారావు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



త్వరలోనే పోరు...హోరు



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఒక్కో ప్రక్రియ పూర్తవుతుండడంతో రాజకీయ పార్టీల్లో కోలాహలం నెలకొంది. ఏడాదిన్నరగా అదిగో.. ఇదిగో అని ప్రచారం జరుగుతున్నా రకరకాల అంశాలతో అడుగు ముందుకు పడలేదు. ఈ నేపథ్యాన పార్టీల్లోనూ స్తబ్దత నెలకొంది. కానీ ఇటీవల ఎన్నికల సంఘం జీపీ, పరిషత్ తుది ఓటర్ల జాబితా ప్రకటించడం.. స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఖరారు చేయడంతో పార్టీల్లోనూ మళ్లీ సందడి మొదలైంది. త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందనే ప్రచారంతో అంతా రణరంగానికి సిద్ధమవుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

జిల్లాలో 'స్థానిక' ఎన్నికల సందడి

- త్వరలోనే షెడ్యూల్ విడుదలవుతుందని ప్రచారం
- రాజకీయ పార్టీల్లో మొదలైన హడావుడి
- శ్రేణులను సమాయత్తం చేసే పనిలో నేతలు

అడ్డంకులతో ఆలస్యమై..

పంచాయతీ, పరిషత్ పాలకవర్గాల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా సాధ్యం కాలేదు. రిజర్వేషన్ల వ్యవహారం ఇందుకు ప్రధాన అడ్డంకిగా నిలిచింది. 2019 ఎన్నికల్లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 గ్రామపంచాయతీ చట్టం తీసుకురాగా.. అప్పటి రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చట్టాన్ని సవరించడంతో స్థానిక సంస్థల గడువు తీరినా ఎన్నికల నిర్వహణ ఆలస్యమైంది. ప్రధానంగా ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అమలుకు సిద్ధమైనా వివిధ అడ్డంకులు రావడంతో జాప్యం జరిగింది. ఈనేపథ్యాన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయనుండగా, ఎన్నికలకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోనున్నాయి.

ఎప్పటికప్పుడు ఏర్పాట్లు..

గతంలో ఎన్నికల నిర్వహణపై స్పష్టత లేకపోయినా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు మాత్రం ఏర్పాట్లు చేస్తూ వచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి 1,580, జీపీ ఎన్నిలకు 5,214 పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఓటర్ల తుదిజాబితాలను విడుదల చేశారు. ఈమేరకు 8,02,690 మంది పరిషత్ ఓటర్లు, జీపీల్లో 8,02,691 మంది ఉన్నారని తేలింది. అలాగే 3,150 బ్యాలెట్ బాక్స్‌లను సమకూర్చుకున్నారు. ఎన్నికల నిర్వహణకు 10,330 మంది ఉద్యోగులు అవసరమని తేల్చారు. వీరిలో పీఓ, ఏపీఓ, ఓపీఓలను ప్రాథమికంగా గుర్తించారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని హైకోర్టు తీర్పునివ్వగా రిజర్వేషన్ల వ్యవహారం తేలక ఆలస్యమైంది. ప్రస్తుతం రిజర్వేషన్ల లెక్కలు కూడా తేలడంతో బీసీ రిజర్వేషన్ జీఓ వెలువడ్డాక స్థానాల వారీగా వివరాలు వెల్లడిస్తారు.

బలాబలాలపై దృష్టి

ఎన్నికల నిర్వహణపై జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న రాజకీయ పార్టీలు ఎలా ముందుకెళ్లాలనే అంశంపై దృష్టి సారించాయి. ఎక్కడెక్కడ బలంగా ఉన్నాం, ఆ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలి, పొత్తు పెట్టుకుంటే ఎవరితో జత కుదురుతుంది.. గ్రామ, మండల స్థాయిల్లో బలమైన నాయకులెవరనే తదితర అంశాలను ముఖ్య నాయకులు పరిశీలిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. కమ్యూనిస్టులతోపాటు బీజేపీలు కూడా తమ బలాన్ని నిరూపించుకోవాలని ఉత్సాహంతో ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ పార్టీ ఈసారి పూర్తిగా తమ మార్క్ చూపాలనే భావనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి మళ్లీ కీలకంగా నిలవాలనే పట్టుదలగా ఉంది. ఇందుకోసం కేడర్‌ను ఉత్తేజపరిచేలా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గతంలోనూ అధికార, ప్రతిపక్ష పార్టీలు పలుమార్లు కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేయగా.. మరోమారు ఉత్సాహం నింపే ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

ఎన్నికలవైపే మొగ్గు..

నిన్న మొన్నటి వరకు ఎన్నికలు జరుగుతాయా, లేదా.. జరిగితే ఎప్పుడు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో ఊగిసలాట ధోరణి కొనసాగింది. అయితే ఎన్నికల నిర్వహణవైపే మొగ్గు చూపిన ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించాలని ఎన్నికల సంఘాన్ని కూడా కోరింది. బీసీ రిజర్వేషన్ జీఓ వెలువడగానే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలి..

- అప్పుడే జీవితంలో రాణించొచ్చు
- కల్లూరు జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బతుకమ్మలతో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్

కల్లూరు: పిల్లలకు గొప్ప భవిష్యత్ ఇవ్వాలని తల్లిదండ్రులు పడే తాపత్రయం, వారి కష్టాన్ని అర్థం చేసుకుంటే జీవితంలో రాణించవచ్చని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కల్లూరులో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన కలెక్టర్ అనుదీప్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కల్లూరులో రూ.75 లక్షలతో నిర్మించిన షాదీఖానాను ప్రారంభించగా, రూ.75 లక్షలతో నిర్మించనున్న అంబేడ్కర్ లైబ్రరీ భవనం, రీడింగ్ రూమ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే, కల్లూరు మార్కెట్ యార్డ్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లోనూ మంత్రి పాల్గొన్నారు. ఆతర్వాత కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆషా ఫౌండేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాలు పంపిణీ చేశాక మంత్రి మాట్లాడారు. కల్లూరు కళాశాల నుంచి 3.5 కి.మీ. దూరాన ఉన్న నారాయణపురంలో పుట్టిన తాను ఇదే కళాశాలలో చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాస్టల్ మంజూరు చేస్తానని ప్రకటించారు. గతంతో పోలిస్తే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున కష్టపడి చదవాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆర్థిక వ్యవస్థ సహకరించకపోయినా గురుకులాల్లో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జీలు 200 శాతం పెంచామని, ప్రతీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా గురుకులాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఇంటర్ చదువు ప్రతీ విద్యార్థి జీవితంలో కీలక మైలురాయిగా నిలవనున్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధిస్తే ఇంజనీరింగ్, మెడికల్, ఇతర వృత్తి నైపుణ్య కోర్సులు పూర్తిచేసి ఉన్నతస్థాయికి చేరవచ్చని తెలిపారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడగా కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, పీఆర్ ఎస్ఈ జి.వెంకట్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, మార్కెట్ చైర్‌పర్సన్ బాగం నీరజ, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు పసుమర్తి చందర్‌రావు, బాగం ప్రభాకర్‌రావు, లక్కినేని సత్యం, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీను, సయ్యద్ అలీ, ఎస్‌డీ.అమీరుద్దీన్, ఎస్‌కే.యాకూబ్ అలీ, ఎస్‌డీ.ఇషాక్, తురాబల్లి, ఎస్‌కే.ఉస్మాన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కూసుమంచి: ప్రతీ మారుమూల గ్రామాన్ని సైతం అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచి మండలంలోని భగవత్‌వీడు, మంగలితండా, ఈశ్వరమాధారం, రాజుపేట బజార్, పెరికసింగారం గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణ పనులకు మంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా చక్కబెడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలే ప్రాధాన్యతగా పథకాలు అందుతాయని చెప్పారు. ప్రతీ గ్రామంలో పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పొంగులేటి స్పష్టం చేశారు.

బస్సు ఎక్కు.. బహుమతి పట్టు!

- దసరా వేళ ఆఫర్ ప్రకటించిన ఆర్టీసీ
- నిర్ణీత తేదీల్లో ప్రయాణించే వారికి అవకాశం
- లక్కీ డ్రా ద్వారా ముగ్గురికి నగదు బహుమతులు



ఖమ్మంమయూరిసెంటర్: ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు బంఫర్ ఆఫర్ ప్రకటించారు. దసరా సెలవుల్లో స్వస్థలాలకు వెళ్లివచ్చే వారు ఆర్టీసీ బస్సులనే ఆశ్రయించేలా లక్కీ డ్రా తీసుకొచ్చారు. రీజియన్ స్థాయిలో మూడే బహుమతులు ప్రకటించినా.. ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఈ సంఖ్య పెంచాలనే ఆలోచనలో ఉన్నారు. దసరా సెలవుల సందర్భంగా ప్రయాణించే వారికి లక్కీ డ్రా ద్వారా నగదు బహుమతులు అందిస్తామన్న ప్రకటనతో మరింత మంది ఆర్టీసీ వైపు ఆకర్షితులవుతారని అంచనా వేస్తున్నారు.

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ కాకుండా..

సెలవు రోజులైన ఈనెల 27వ తేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు ఖమ్మం రీజియన్ డిపోలకు చెందిన డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి ఏసీ, నాన్ ఏసీ, రాజధాని బస్సుల్లో ప్రయాణించే వారు లక్కీ డ్రాకు అర్హత సాధిస్తారు. నిర్ణీత తేదీల్లో ఆయా బస్సుల్లో ప్రయాణించే వారు ప్రయాణం పూర్తయ్యాక తమ టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన బాక్స్‌ల్లో వేయాలి.

లక్కీ డ్రా ద్వారా ఎంపిక..

అన్ని డిపోల్లోని బాక్స్‌ల్లో వేసిన టికెట్లను ఖమ్మంకు చేరుస్తారు. అక్టోబర్ 8న ఖమ్మంలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో తీసే డ్రా లో ఇందులో నుంచి ముగ్గురిని విజేతలుగా ప్రకటిస్తారు. వీరికి వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేల నగదు బహుమతులు అందిస్తామని అధికారులు వెల్లడించారు.

ప్రయాణికులను ప్రోత్సహించేలా..



సెలవుల్లో సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులకు సురక్షితంగా చేరేలా ఆర్టీసీ ద్వారా అదనపు సర్వీసులు సమకూరుస్తున్నాం. ఇదే క్రమాన ఆర్టీసీని ఆశ్రయించిన వారిని ప్రోత్సహించేలా బహుమతులు ఇవ్వాలని నిర్ణయించాం. ఇందులో భాగంగా ప్రకటించిన లక్కీ డ్రా స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– ఏ.సరిరామ్, ఖమ్మం రీజినల్ మేనేజర్

ప్రకృతిని పూజించడమే బతుకమ్మ



బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ప్రకృతిని పూజించడమే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పరమార్థమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఐదో రోజైన గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు బతుకమ్మలను పేర్చి పూజలు చేశాక ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ మహిళా ఉద్యోగులతో ఆడి ఉత్తేజపరిచారు. డీఆర్వో ఏ.పద్మశ్రీ, పౌర సరఫరా సంస్థ డీఎం శ్రీలత, బీసీడబ్ల్యూఓ జ్యోతి, తహసీల్దార్లు అరుణ, శ్వేత, డీవైఎస్ఓ తుంబూరు సునీల్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి శ్రీరామ్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఈసారి దక్కించుకోవాల్సిందే..!

- మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ జారీ
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 18 వరకు గడువు, 23న డ్రా

ఖమ్మంక్రైం: జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 122 వైన్స్‌కు శుక్రవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుకానుంది. ప్రస్తుతం కొనసాగుతున్న షాప్‌ల లైసెన్స్ కాలపరిమితి నవంబర్ 30న ముగియనుండగా.. ఆలోగా దరఖాస్తుల స్వీకరణ, డ్రా పూర్తి చేస్తే కొత్తగా షాప్‌లు దక్కించుకున్న వారు డిసెంబర్ 1వ తేదీ నుంచి మద్యం దుకాణాలు ప్రారంభించనున్నారు. నోటిఫికేషన్ వెలువడగానే ఇప్పటికే వ్యాపారంలో ఉన్న వారే కాక కొత్త వ్యక్తులు సైతం టెండర్ల దాఖలుకు ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం. పాత వారితో గతంలో షాప్‌లు దక్కని వారు ఈసారి ఎలాగైనా వైన్స్ దక్కించుకోవాలనే భావనతో జట్టుగా మారుతున్నట్లు తెలిసింది.

ఎక్కడికక్కడే దరఖాస్తుల స్వీకరణ

మద్యం షాప్‌ల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 26వ తేదీన మొదలై అక్టోబర్ 18న ముగియనుంది. అదేనెల 23వ తేదీన డ్రా ద్వారా షాప్‌లను ఖరారు చేస్తారు. ఖమ్మం–1, 2, మధిర, సత్తుపల్లి, వైరా, సింగరేణి, నేలకొండపల్లి ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్లలో ఆయా పరిధిలోని వైన్స్ టెండర్లు స్వీకరిస్తారు. ఈమేరకు గురువారం నోటిఫికేషన్ రావడంతో ఎక్సైజ్ సూపరిండెంట్ నాగేందర్‌రెడ్డి అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై సూచనలు చేశారు.

లైసెన్స్ ఫీజు రూ.3లక్షలు

మద్యం దుకాణాల ఏర్పాటుకు లైసెన్స్ ఫీజును రూ.3లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. గత ఎక్సైజ్ పాలసీలో రూ.2లక్షలు ఉండగా రూ.లక్షల పెంచారు. దీంతో దరఖాస్తుల రూపంలోనే ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం లభించనుంది. గత పాలసీలో 122 మద్యం దుకాణాలకు 7,207 దరఖాస్తులు అందగా, రూ.144.14 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లాలోనే అత్యధిక దరఖాస్తులు అందాయి. దీంతో ఈసారి మరింత ఆదాయం రాబట్టుకోవాలనే భావనతో ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

దరఖాస్తులు తగ్గుతాయా?



ఈ ఎక్సైజ్ పాలసీలో దరఖాస్తుల సంఖ్య తగ్గే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత పాలసీ సమ యాన ఏపీ వ్యాపారు లు పలువురు జిల్లాలో వైన్స్ దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. కానీ అక్కడ కూడా ఎక్సైజ్ పాలసీలో మార్పులు జరగడంతో జిల్లాలో వైన్స్ నిర్వహిస్తున్న ఏపీ వ్యాపారులు కొందరు ఈసారి టెండర్లు దాఖలు చేయడానికి ఆసక్తి చూపించడం లేదని తెలిసింది. ఈ నేపథ్యాన బడా వ్యాపారులను కలిసి టెండర్లు దాఖలుకు ముందుకొచ్చేలా ప్రయత్నం చేయాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

రిజర్వేషన్లు అవే...

వైన్స్ కేటాయింపులో గౌడ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలుచేశారు. రిజర్వేషన్ల ఆధారంగా కొన్ని షాపులను ఎంపిక చేసి వారికే టెండర్ల ద్వారా కట్టబెట్టారు. ఈసారి కూడా అవే రిజర్వేషన్ల కొనసాగే అవకాశముందని అధికారులు తెలిపారు. అయితే, రిజర్వేషన్ కేటగిరీలో కొన్ని సర్కిళ్లలో పెరిగి.. ఇంకొన్ని సర్కిళ్లలో తగ్గే అవకాశముందని సమాచారం. ఈ విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

మూడే దరఖాస్తులు

ఖమ్మంక్రైం: ఎక్సైజ్ అధికారులు మైక్రో బేవరేజెస్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించగా గడువు గురువారంతో ముగిసింది. హైదరాబాద్ తర్వాత అన్ని కార్పొరేషన్లలో మైక్రో బేవరేజెస్ ఏర్పాటుకు రూ.లక్ష దరఖాస్తు ఫీజుగా నిర్ణయించారు. అయితే, గడువు ముగిసే సమయానికి ఉమ్మడి జిల్లాలో మూడు దరఖాస్తులే అందాయి. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో రెండు, కొత్తగూడెం జిల్లాలో ఒక దరఖాస్తు అందిందని అధికారులు తెలిపారు. అయితే, మైక్రో బేవరేజెస్‌పై ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పించకపోవడం, ఇప్పటికే ఉన్న బార్లు సరిగ్గా నడవకపోవడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు ఎక్కువ మంది వ్యాపారులు నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకారం వైన్స్ దక్కించుకోవడంపై దృష్టి సారించడంతో మైక్రో బ్రేవరేజెస్‌పై దృష్టి సారించలేదని సమాచారం.

'స్థానికం'లో బీఆర్‌ఎస్ సత్తా చాటుదాం..



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ, పక్కన రవిచంద్ర, నామా తదితరులు

పార్టీ శ్రేణులతో సమీక్షలో మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మంవైరారోడ్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటేలా శ్రేణులు కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ఖమ్మం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం ఖమ్మంలో పువ్వాడతో పాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చలేక ఎన్నికల నిర్వహణకు భయపడుతోందని తెలిపారు. యూరియా కోసం రైతులు ఇక్కట్లు పడుతుండగా రైతులకు పనిలేక లైన్‌లో నిలబడుతున్నారని చెప్పడం గర్హనీయమన్నారు. హామీల అమలులో విఫలమవడమేకాక మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కూలిపోయిందని చెబుతూనే హైదరాబాద్‌కు కాళేశ్వరం ద్వారా నీళ్లు తీసుకొచ్చేలా శంకుస్థాపన చేయడం ఏమిటని పువ్వాడ ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బంధు, నిరుద్యోగ భృతి, 4వేల పింఛన్, ఆడపిల్లలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం తదితర హామీలు విస్మరించిన విషయాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాగా, కొందరు తనను ఎదుర్కొలేక ఖమ్మంకు రాడని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేవరకు విశ్రమించనని పువ్వాడ తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ, మార్కెట్ మాజీ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డితో పాటు నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, ఖమర్, కర్నాటి కృష్ణ, మక్బూల్, వీరూనాయక్, గుత్తా రవి, మెంతుల శ్రీశైలం, అమరగాని వెంకన్న, హరిప్రసాద్, లక్ష్మణ్‌నాయక్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అడ్డంకులు అధిగమించి కొలువుల్లోకి..

- నియామక పత్రాలు అందుకోనున్న గ్రూప్‌- 1 విజేతలు
- జాబితాలో నిరుపేదల బిడ్డలు పలువురు ...
- ఇతర ఉద్యోగాలు చేస్తూనే ఎంపికైన కొందరు



పరీక్షలు, ఆ తర్వాత ఫలితాలు, ఇంటర్వ్యూలు పూర్తికావడానికి అనేక అడ్డంకులు.. అంతా పూర్తయ్యాక కేసులు.. ఇలా గ్రూప్‌–1లో ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాల పంపిణీ ఆలస్యమవుతూ వచ్చింది. ఎట్టకేలకు సమస్యలన్నీ పరిష్కారం కావడంతో అభ్యర్థులకు ప్రభుత్వం నియామక పత్రాలు అందజేయనుంది. దీంతో గ్రూప్‌–1 ఉద్యోగం దక్కించుకుని ఏళ్ల కల నెరవేర్చుకున్న వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో పలువురు కూలీల బిడ్డలు, నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు ఉండగా.. ఇంకొందరు ఉద్యోగాలు చేస్తూనే గ్రూప్‌–1కు ఎంపికయ్యారు. అయితే, ఇందులో చాలా మంది సివిల్స్‌ సాధించడమే తమ లక్ష్యమని చెప్పడం వారి తపనను చాటింది.

జనరల్‌ కేటగిరీలో డీఎస్పీగా..


తుమ్మలపల్లి సంజయ్‌

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన తుమ్మలపల్లి సంజయ్‌ గ్రూప్‌–1లో జనరల్‌ కేటగిరీలో 469 మార్కులతో డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఆయన తల్లి దండ్రులు నర్సింహారావు–ఉమ గ్రామంలో హోటల్‌ నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచే కష్టపడి చదివిన సంజయ్‌ డిగ్రీ పూర్తయ్యాక గ్రూప్స్‌ కోసం శిక్షణ తీసుకున్నాడు.

సివిల్స్‌కు సిద్ధమవుతూనే..


రాహుల్‌

తల్లాడ: తల్లాడకు చెందిన చింతా రాజు – చంద్రకళ కుమారుడు రాహుల్‌ 2019లో సివిల్స్‌ లక్ష్యంగా ఢిల్లీలో శిక్షణ తీసుకున్నారు. గత ఆరేళ్లుగా కష్టపడుతున్న ఆయన జనరల్‌లో 232, మల్టీ జోన్‌లో 115, ఎస్సీ కేటగిరీలో 8వ ర్యాంక్‌ సాధించి గ్రూప్‌–1 సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. బీటెక్‌ పూర్తిచేసిన రాహుల్‌ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి గృహిణి.

ఏఎంవీఐ నుంచి ఆర్‌టీఓగా...


గోపీకృష్ణ

ఖమ్మంక్రైం: గ్రూప్‌–1 ఫలితాల్లో ఖమ్మం ఏఎంవీఐ(అసిస్టెంట్‌ మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌) వెల్ది గోపీకృష్ణ ఆర్‌టీఓ(రవాణా ట్రాన్స్‌పోర్ట్‌ అధికారి)గా ఎంపికయ్యాడు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాకు చెందిన రైతు కుటుంబం నాగేశ్వరరావు – విజయలక్ష్మి పెద్దకుమారుడైన గోపీకృష్ణ ఇంజనీరింగ్‌ పూర్తిచేశాక పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు రాసి పది ఉద్యోగాలు సాధించాడు. ఇందులో ఏడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. గ్రూప్‌–1 సిద్ధమవుతున్న సమయాన గోపీకృష్ణ తండ్రి మృతి చెందగా.. తల్లి విజయలక్ష్మి, సోదరుడు గణేష్‌ ప్రోత్సాహంతో ముందుకు సాగిన ఆయన విజయం సాధించాడు. గోపీకృష్ణను డీటీఓ వెంకటరమణ, ఎంవీఐలు వరప్రసాద్‌, శ్రీనివాస్‌, ఏఎంవీఐ స్వర్ణలత, ఏఓ సుధాకర్‌ అభినందించారు.

సుతారి మేస్త్రీ బిడ్డ..


జ్యోతిశిరీష

వైరా: తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన జంగం జ్యోతిశిరీష ఆడిట్‌ ఆఫీసర్‌గా ఎంపికైంది. ఆమె తండ్రి పోలు సుతారీ మేస్త్రీ కాగా, తల్లి షారమ్మ వ్యవసాయ కూలీ. జ్యోతి ఇప్పటికే గురుకుల టీజీటీ, ఐసీడీఎస్‌ ఎక్స్‌టెన్షన్‌ ఆఫీసర్‌, గ్రూప్‌–4తో పాటు టీచర్‌ ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. ఈనేపథ్యాన గ్రూప్‌–1 ఉద్యోగం సాధించిన ఆమె తన లక్ష్యం మాత్రం ఐఏఎస్‌ సాధించడమేనని ధీమాగా చెబుతోంది.

ఉద్యోగం చేస్తూనే..


సుష్మిత

తల్లాడ : పట్టణానికి చెందిన గోపిశెట్టి వెంకటేశ్వర్‌రావు – విజయలక్ష్మి కుమార్తె సుష్మిత గ్రూప్‌–1లో 464.5 మార్కులతో జోన్‌లో 132వ ర్యాంక్‌ సాధించింది. గతంలో ఆమె గ్రూప్‌–3, 4లో ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం జేఎన్‌టీయూలో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. అయినా తన లక్ష్యాన్ని మరిచిపోకుండా గ్రూప్‌–1కు ఎంపికవడంతో ఎంపీడీఓ ఉద్యోగం సాధించింది.

ఖుషీల్‌.. డిప్యూటీ కలెక్టర్‌


ఖుషీల్‌వంశీ

తిరుమలాయపాలెం: గ్రూప్‌–1 ఫలితాలలో మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి శివకుమార్‌ – రేణుక కుమారుడు ఖుషీల్‌వంశీ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాడు. జనరల్‌ కేటగిరీలో రాష్ట్రస్థాయి 63, రిజర్వేషన్‌ కేటగిరీలో 3వ ర్యాంకు సాధించిన ఆయన గతంలో ఎస్సై ఉద్యోగంతో పాటు యూపీఎస్సీ ద్వారా ఇన్‌కం ట్యాక్స్‌ అసిస్టెంట్‌, సెంట్రల్‌ పోలీస్‌ అసిస్టెంట్‌ కమాండో, మిలిటరీ ఆఫీసర్‌ ఉద్యోగాలు సాధించాడు. ఖుషీల్‌ తండ్రి శివకుమార్‌ మాస్‌లైన్‌ సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా, తల్లి రేణుక పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పనిచేస్తున్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతూ తల్లిదండ్రులను చూస్తూ పెరిగిన ఆయన డిప్యూటీ కలెక్టర్‌గా ప్రజలకు తన వంతు చేయూతనిస్తానని చెబుతున్నాడు.

డీఎస్పీగా లక్ష్మీసాహితి


లక్ష్మీసాహితి

వైరా: వైరాకు చెందిన సంగెపు లక్ష్మీసాహితి రాష్ట్ర స్థాయిలో 129, మల్టీ జోన్‌ పరిధిలో 69వ ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికైంది. ఆమె తండ్రి వెంకటేశ్వరరావు బీమా కంపెనీలో ఏజెంట్‌. తల్లి కవిత గృహిణి. రెండు సివిల్స్‌ రాస్తే ఫలితం దక్కకున్నా నిరాశ చెందని లక్ష్మీ ఇప్పుడు గ్రూప్‌–1 సాధించింది. ఈ ఉద్యోగం చేస్తూనే ఐఏఎస్‌కు సిద్ధమవుతానని వెల్లడించింది.

రైతు కుటుంబం నుంచి డీఎస్పీ


అఖిల్‌

బోనకల్‌: మండలంలోని తూటికుంట్లకు చెందిన పాపినేని అఖిల్‌ గ్రూప్‌–1లో ప్రతిభ చాటి డీఎస్పీ పోస్టు సాధించాడు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన ఆయన వరంగల్‌ నిట్‌లో కెమికల్‌ ఇంజనీరింగ్‌ పూర్తిచేశాడు. సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌గా కొన్నాళ్లు పనిచేసినా సివిల్స్‌కు సిద్ధమయ్యేందుకు ఉద్యోగం వదిలేశాడు. రెండుసార్లు సివిల్స్‌లో విజ యం దక్కకపోవడంతో గత ఏడాది గ్రూప్‌–1 పరీక్ష రాసి రాష్ట్ర స్థాయిలో 314, జోన్‌ పరిధిలో 134వ ర్యాంకు సాధించాడు.

అమ్మ కష్టంతో డిప్యూటీ కలెక్టర్‌ హోదా..


ఎం.మురళి

ఖమ్మంమయూరిసెంటర్‌: ఖమ్మం ఖానాపురానికి చెందిన ఎం.మురళి గ్రూప్‌–1లో సత్తా చాటి డిప్యూటీ కలెక్టర్‌ ఉద్యోగం సాధించాడు. రాష్ట్రస్థాయిలో 83, జోనల్‌ స్థాయిలో 47వ ర్యాంకు సాధించిన ఆయన తన తండ్రి లక్ష్మీనారాయణ కన్నుమూయగా తల్లి పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తూ చదివించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా చదువుతూనే ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించి 2018లో టీజీఎస్పీ స్పెషల్‌ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. 2020లో సివిల్‌ కానిస్టేబుల్‌గా, 2024లో టీజీపీఎస్సీ ద్వారా జూనియర్‌ అకౌంటెంట్‌గా ఉద్యోగం సాధించిన మురళి ప్రస్తుతం ఖమ్మం నగర పాలక సంస్థలో జూనియర్‌ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పుడు గ్రూప్‌–1 ఉద్యోగం సాధించడానికి తన అమ్మ కష్టమే కారణమని మురళి వెల్లడించాడు. ఆయనను కేఎంసీ అకౌంట్స్‌ విభాగం ఉద్యోగులు అభినందించారు.

ఏఈగా పనిచేస్తూనే డీఎస్పీగా..


హిమవర్షిణిరెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన గోలి హిమవర్షిణిరెడ్డి గ్రూప్‌–1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైంది. బీటెక్‌ పూర్తిచేసిన ఆమె ప్రస్తుతం పంచాయతీరాజ్‌ శాఖలో ఏఈగా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె తండ్రి శ్రీనివాసరెడ్డి ఎల్‌ఐసీ ఏజెంట్‌ కాగా, డీఎస్పీగా ఎంపికైన హిమవర్షిణిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌ అభినందించారు.

ఎస్సై.. జిల్లా రిజిస్ట్రార్‌


సందీప్‌

కల్లూరురూరల్‌: గ్రూప్‌–1 ఫలితాల్లో కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన దొడ్డపునేని సందీప్‌ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఆయన ఇల్లెందులో ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన సందీప్‌ గ్రూప్‌–1 ఉద్యోగానికి ఎంపికవడంపై పలువురు అభినందించారు.

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం చేస్తూ..


అజయ్‌

సత్తుపల్లిరూరల్‌: సత్తుపల్లి మండలం సత్యనారాయణపురానికి చెందిన పూరేటి అజయ్‌ గ్రూప్‌–1 ఫలితాల్లో ప్రతిభ చాటి ఎంపీడీఓగా ఎంపికయ్యారు. ఆయన తండ్రి శ్యామ్యూల్‌ తుంబూరు పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తుండగా, తల్లి ఝాన్సీ, సోదరి అలేఖ్య ఉన్నారు. ఐఐటీ భువనేశ్వర్‌లో బీటెక్‌ చేసిన అజయ్‌ నోయిడాలో సాఫ్ట్‌వేర్‌ డెవలపర్‌గా పనిచేయగా.. ఐఏఎస్‌ కావాలనే లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు.

సివిల్స్‌ సాధిస్తా..


రత్నేశ్వరనాయుడు

కామేపల్లి: మండలంలోని గోవింద్రాలకు చెందిన గంగారపు సత్యనారాయణ–జ్యోతిర్మయి దంపతుల చిన్నకుమారుడు రత్నేశ్వరనాయుడు గ్రూప్‌–1 ఫలితాల్లో అసిస్టెంట్‌ ట్రెజరీ ఆఫీసర్‌(ఏటీఓ)గా ఎంపికయ్యాడు. ప్రసుత్తం ఆయన ఖమ్మంలోని కమర్షియల్‌ టాక్స్‌ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విజయం సాధించిన తాను సివిల్స్‌ సాధించే వరకు పట్టువిడవనని వెల్లడించాడు.

రిక్షా కార్మికుడి కుమారుడు..


పుల్లారావు

సత్తుపల్లిటౌన్‌: సత్తుపల్లి అంబేద్కర్‌నగర్‌ కాలనీకి చెందిన రిక్షాకార్మికుడు కోలేటి కృష్ణయ్య – పేరమ్మ కుమారుడు కోలేటి పుల్లారావు గ్రూప్‌–1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికయ్యాడు. పుల్లారావు చదువంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే కొనసాగింది. తల్లిదండ్రులు రెండేళ్ల క్రితమే కన్నుమూయగా, పుల్లారావు ప్రస్తుతం న్యూఢిల్లీలోని సెంట్రల్‌ సెక్రటేరియట్‌లో ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు.

54 అడుగుల భారీ బతుకమ్మ



కూసుమంచి: మండలంలోని పెరికసింగారంలో ఏటా బతుకమ్మ పండుగను స్థానికులు ఘనంగా జరుపుకుంటూ భారీ బతుకమ్మలు పేర్చడంలో పోటీ పడతారు. ఇందులో భాగంగా గురువారం జరిగిన వేడుకలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకాగా.. మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు కుటుంబసభ్యులు 54 అడుగుల భారీ బతుకమ్మ పేర్చి ప్రథమ స్థానంలో నిలిచారు. ఇందుకోసం ఆరు క్వింటాళ్ల బంతి, తంగేడు, టేకు పూలను వినియోగించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు కుటుంబాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించడమేకాక కాసేపు మహిళలతో కలిసి కోలాటం ఆడారు.

నేటి నుంచి అసెస్‌మెంట్‌ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్‌: సర్వే అండ్‌ ల్యాండ్‌ రికార్డ్స్‌ విభాగంలో సర్వేయర్లుగా అప్రెంటిస్‌ శిక్షణ పొందిన వారికి అసెస్‌మెంట్‌ పరీక్షలు నిర్వహించనున్నారు. అప్రెంటిస్‌ పూర్తయినందున ఈనెల 26, 27, 29వ తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు జిల్లాలో 305మంది పరీక్ష రాయనున్నారని వెల్లడించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య


మురళీకృష్ణ (ఫైల్‌)

బోనకల్‌: మండలంలోని నారాయణపురం గ్రామానికి సూర్యదేవర మురళీకృష్ణ(35) గురువారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన మొదటి భార్య చనిపోవడంతో హైదరాబాద్‌కు చెందిన వైష్ణవిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. కొన్నాళ్లుగా దంపతుల నడుమ కలహాలతో వైష్ణవి కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. నారాయణపురంలో ఇంటి వద్ద ఉంటున్న మురళీకృష్ణ మద్యానికి బానిసగా మారి.. ఇంట్లో ఎవ్వరు లేని సమయాన ఉరి వేసుకున్నాడు. ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకన్న తెలిపారు.

సైబర్‌ నేరంలో నిందితుడి అరెస్టు

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన రిటైర్డ్‌ ఉద్యోగి బ్యాంక్‌ ఖాతా నుంచి రూ.11.49 లక్షలు కాజేసిన కేసులో ఓ నిందితుడిని ఖమ్మం సైబర్‌ క్రైమ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ముఠా ఏర్పడిన నిందితులు రిటైర్డ్‌ ఉద్యోగికి మాయమాటలు చెప్పి ఆయన ఖాతా నుంచి నగదు కాజేశారు. రంగారెడ్డి జిల్లా శంకరపల్లికి చెందిన కావలి శ్రీనివాస్‌ ముఠా తస్కరించే నగదును కొన్ని అకౌంట్లలో జమ చేసేందుకు సహకరిస్తున్నాడు. ఈమేరకు శ్రీనివాస్‌ను గురువారం ఆయన స్వగ్రామంలో అరెస్ట్‌ చేసి ఖమ్మం సైబర్‌ క్రైమ్‌ కోర్టులో హాజరుపరిచాక రిమాండ్‌కు తరలించారు. కాగా, కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించిన సైబర్‌ క్రైమ్‌ డీఎస్పీ సీహెచ్‌ఆర్‌వీ.ఫణీదర్‌, ఎస్సైలు రంజిత్‌ కుమార్‌, విజయకుమార్‌, కానిస్టేబుళ్లు కృష్ణారావు, ఉదయభానుమూర్తిని ఖమ్మం సీపీ సునీల్‌దత్‌ అభినందించారు.

బంగారు బిస్కెట్‌ పేరుతో కుచ్చుటోపీ

బంగారం, నగదు తీసుకుని మాయం

ఖమ్మంక్రైం: బంగారు బిస్కెట్‌ తక్కువ ధరకే ఇస్తామంటూ నమ్మబలికి మహిళ వద్ద బంగారు నగలు, నగదు తీసుకుని ఇద్దరు ఉడాయించారు. ఇందుకు సంబంధించి గురువారం ఖమ్మం త్రీటౌన్‌ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలిలా ఉన్నాయి. కొణిజర్ల మండలానికి చెందిన ఓ మహిళ ఈనెల 20న ఖమ్మం పాత బస్టాండ్‌లో దిగి గాంధీచౌక్‌ వైపు వెళ్తోంది. అక్కడ ఓ అపరిచిత మహిళ ముందు వెళ్తూ పథకం ప్రకారం ఆమె చేతిలోని ప్యాకెట్‌ జారవిడిచింది. ఆపై ఆమే ప్యాకెట్‌ తెరిచి బంగారు బిస్కెట్‌ దొరికిందని చెబుతుండగా మరో వ్యక్తి వచ్చి 10తులాలు బంగారు బిస్కెట్‌ విలువ రూ.10లక్షలకు పైగా ఉంటుందని చెప్పాడు. ఇదంతా చూసిన కొణిజర్ల మహిళ ఆరా తీయగా డబ్బు అవసరమున్నందున రూ.10లక్షల విలువైన బిస్కెట్‌కు రూ.5లక్షలు ఇస్తే చాలని చెప్పడంతో రెండో వ్యక్తి తాను తెచ్చి ఇస్తానని వెళ్లాడు. ఇదంతా నిజమేనని నమ్మిన కొణిజర్ల మహిళ తన వద్ద ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, రూ.10వేల నగదును అపరిచిత మహిళకు ఇవ్వడమే కాక మిగతా నగదు తెచ్చి ఇస్తానని చెప్పింది. దీంతో అపరిచిత మహిళ తాను కేశవరావు పార్క్‌ వద్ద ఉంటానని పేర్కొనగా, కొణిజర్ల మహిళ స్వగ్రామానికి వెళ్లి కొందరికి చూపించగా నకిలీ బంగారమని చెప్పడంతో ఖమ్మం వచ్చి నాలుగు రోజులు వెతికినా అపరిచితుల ఆచూకీ తెలియరాలేదు. దీంతో గురువారం బాధితురాలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్‌ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

యువకుల వద్ద గంజాయి స్వాధీనం

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై ఓ దాబా సమీపాన ఇద్దరు యువకుల వద్ద 30గ్రాముల గంజాయిని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. సిబ్బంది పెట్రోలింగ్‌ చేస్తుండగా దాబా సమీపాన ఖాళీ స్థలంలో వాల్యాతండాకు చెందిన బానోత్‌ అరవింద్‌, వడిత్య నవీన్‌ పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా సొంతానికి ఉపయోగిస్తున్న 30 గ్రాముల గంజాయి లభించడంతో అరెస్ట్‌ చేశామని ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఖమ్మం లీగల్‌: చోరీకి చేసేందుకు వచ్చిన వ్యక్తి మహిళను హత్య చేయగా.. నిందితుడికి జీవితఖైదు విధిస్తూ ఖమ్మం రెండో అదనపు జిల్లా న్యాయాధికారి వెంపటి అపర్ణ గురువారం తీర్పు చెప్పారు. ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్‌ మండలం మద్దులపల్లికి చెందిన షేక్‌ జాన్‌బీ కోదాడ క్రాస్‌ వద్ద రోడ్డు పక్కన గుడిసె వేసుకొని మేకలు, కోళ్లు పెంచి అమ్ముతూ జీవనం సాగిస్తోంది. ఈక్రమాన 2022 ఫిబ్రవరి 24న చోరీకి వచ్చిన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం వెల్దండకు చెందిన పర్వతం వెంకన్న ఆమె గొంతు కోసి రెండు మేకలు ఎత్తుకెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఖమ్మం గాంధీ బొమ్మ సెంటర్‌లో మేకలను అమ్ముతుండగా స్థానికులు గుర్తించి జాన్‌బీ కుమారుడు రఫీకి సమాచారం ఇచ్చారు. దీంతో రఫీ తన తల్లి ఉండే గుడిసె వద్దకు వెళ్లగా గొంతు కోయబడి రక్తపు మడుగులో చనిపోయి ఉంది. ఈమేరకు వెంకన్నపై ఖమ్మం రూరల్‌ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి కోర్టులో చార్జీషీట్‌ దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ తరఫున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఏ.శంకర్‌ వాదించగా, ఉద్యోగులు శ్రీకాంత్‌, ఎస్‌.డీ.యూసుఫ్‌ సహకరించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

కూసుమంచి: కూసుమంచి గ్రామానికి చెందిన వేముల సాయి(26) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 11న ఆయన మద్యం మత్తులో గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయి మృతి చెందగా, ఆయన సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

ఏన్కూరు: మండలంలోని కేసుపల్లిలో గురువారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. నలుగురు స్థానికులపైనే కాక నాలుగు పశువులను సైతం కుక్క గాయపరిచింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ముప్పుతిప్పలు పెట్టిన కుక్కను చివరకు గ్రామస్తులు చంపేశారు. అయితే గ్రామంలోని మరికొన్ని కుక్కలను ఈ పిచ్చికుక్క కరవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

జిల్లా ఉపాధ్యాయులకు అవార్డులు


అవధానుల మురళీకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం


అవార్డు అందుకుంటున్న మౌలాలి

ఖమ్మం సహకారనగర్‌/కల్లూరు/కల్లూరురూరల్‌: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన గణిత ఉపాధ్యాయులకు శారదా ఎడ్యుకేషనల్‌ సొసైటీ ఆధ్వర్యాన 'నేషనల్‌ టీచర్‌ ఎక్స్‌లెన్స్‌' అవార్డులు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ముదిగొండ జెడ్పీహెచ్‌ఎస్‌, కల్లూరు పేరువంచ జెడ్పీహెచ్‌ఎస్‌ ఉపాధ్యాయులు అవధానుల మురళీకృష్ణ, ఎం.డీ.మౌలానా ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వీరికి ఎమ్మెల్సీ మల్కం కొమరయ్య అవార్డులు అందజేయగా కారుమంచి రఘు, పసునూరి శ్రీనివాస్‌, పట్నం కమలామనోహర్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌ అదనపు టవర్లతో మెరుగైన సేవలు


సమావేశంలో పాల్గొన్న టీఏసీ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్‌: ఉమ్మడి జిల్లాలో అవసరమైన చోట్ల బీఎస్‌ఎన్‌ఎల్‌ టవర్లు ఏర్పాటచేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని టెలిఫోన్‌ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి క్యాంప్‌ కార్యాలయంలో గురువారం సభ్యులు సమావేశమయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఎస్‌ఎన్‌ఎల్‌ ద్వారా మెరుగైన సేవలందేలా 189టవర్ల అవసరముందని టీఏసీ కమిటీ, అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యాన ఎంపీ ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టీఏసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్‌ భాయ్‌, అమరవాది సత్యనారాయణరెడ్డి, బానోత్‌ రంజిత్‌ నాయక్‌, మచ్చా రామారావు, పల్లెల రామలక్ష్మయ్యగౌడ్‌, కాంగ్రెస్‌ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



స్వామి ఉత్సవ విగ్రహంతో అర్చకులు, భక్తులు

ఖమ్మంగాంధీచౌక్‌: భక్తుల జయజయధ్వానాల నడుమ ఖమ్మంలోని స్తంభాద్రి గుట్ట చుట్టూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణ గురువారం వైభవంగా సాగింది. స్వామి వారి జన్మనక్షత్రం(స్వాతి నక్షత్రం) సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆలయం నుంచి తీసుకొచ్చి గుట్ట చుట్టూ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నృసింహ నామ స్మరణ చేయగా, కోలాట బృందాలు సైతం పంచుకున్నాయి. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారిని తిరిగి గుట్టపైకి చేర్చి, రాతి కొండపై పండితులు నక్షత్ర జ్యోతిని వెలిగించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, అర్చకులు పాల్గొన్నారు.

జెడ్పీలో 'స్వచ్ఛత'

ఖమ్మంగాంధీచౌక్‌: వచ్చేనెల 2వ తేదీ వరకు తపాలా శాఖ ఆధ్వర్యాన నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు గురువారం ఖమ్మంలోని జెడ్పీ కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. తపాలా డివిజన్‌ కార్యాలయ ఏఎస్పీ మధుసూదన్‌ రావు, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌, కాశీ హైమావతి, వివిధ పోస్టాఫీసుల పోస్టుమాస్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ సమితిలో 'బాగం'



ఖమ్మంమయూరిసెంటర్‌: సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా ఖమ్మంకు చెందిన బాగం హేమంతరావు రెండోసారి ఎన్నికయ్యారు. చండీఘర్‌లో ఇటీవల జరిగిన జాతీయ మహాసభల్లో కమిటీని ఎన్నుకోగా ఆయనకు స్థానం దక్కింది.

ఖమ్మం మార్కెట్‌ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,802	3,500
ఏసీ మిర్చి	14,800	8,000
మిర్చి	8,200	7,000
కొత్త పత్తి	7,600	4,000

– ఖమ్మం వ్యవసాయం